ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
మంగళవారం 27 జనవరి 2026 www.prajaswaramdailly.com 3 PM

# వరంగల్‌లో విషాదం



## బైక్ను ఢీకొన్న టిప్పర్

## చికిత్స పొందుతూ గర్భిణిగా ఉన్న వైద్యురాలి మృతి

**వరంగల్, ప్రజాస్వరం** రోడ్డు ప్రమాదంలో నిండు గర్భిణిగా ఉన్న వైద్యురాలు మృతిచెందారు. ఈ సంఘటన వరంగల్ జిల్లా మట్టెవాడలో జరిగింది. ఎస్సై శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని గుల్బర్గా జిల్లా చించోలి మండలం బత్తంపల్లికి చెందిన ఎస్.మమతారాణి వైద్యురాలిగా పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి విధులు ముగించుకొని భర్తతో కలిసి హంటర్ రోడ్డు మీదుగా బైక్‌పై ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యలో ఏడు మోరీల కూడలి వద్దకు రాగానే వెనక నుంచి వచ్చిన టిప్పర్ వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలు కింద పడిపోయారు. 9 నెలల గర్భిణిగా ఉన్న మమతా రాణి తీవ్రంగా గాయపడటంతో స్థానికుల సహాయంతో భర్త నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందారు. టిప్పర్ డ్రైవర్ అన్సారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని ఝార్ఖండ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రెడ్ కార్పెట్ .. మళ్లీ అలాంటి వారికే



## చిరంజీవి వ్యాఖ్యల్ని విభేదించిన సింగర్ చిన్మయి

## కమిట్మెంట్ అనే పదానికి అర్థం పూర్తిగా వేరు

టాలీవుడ్, ప్రజాస్వరం
సినీ పరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ పై సింగర్ చిన్మయి స్పందించారు. చిరంజీవి వ్యాఖ్యల్నివిభేదించారు. ఫిలిం ఇండస్ట్రీ అద్దం లాంటిది, కాస్టింగ్ కౌచ్ లేదన్న చిరు వ్యాఖ్యల్ని ఖండించారు. ఫిలిం ఇండస్ట్రీలో కమిట్మెంట్ అనే పదానికి అర్థం పూర్తిగా వేరు గా ఉందన్నారు. మహిళలు తమ శరీరాన్ని అప్ప గించకపోతే అవకాశాలు రావని అన్నట్లు సమాచారం. అప్పట్లో నటీనటుల మధ్య గౌరవప్రదమైన సంబంధాలు ఉండేవన్నారు. గతంలో ప్రముఖ సింగర్ మహిళల్ని లైంగికంగా వేధించాడని ఆరోపించారు. అలాంటి నేరస్తులేకే మళ్లీ రెడ్ కార్పెట్ వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సీఎం రేవంత్‌కు సంతోష్ గూఢచారి


## నేను ముందునుంచి చెబుతున్న దెయ్యం ఆయనే

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత




**హైదరాబాద్, ప్రజాస్వరం**
"సీఎం రేవంత్‌రెడ్డికి సంతోష్‌రావు గూఢచారి. నేను ముందునుంచి చెబుతున్న దెయ్యం ఆయనే. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ సంతోష్‌కు ఎలాంటి శిక్ష విధిస్తుందనేది వేచి చూడాలి. ఆయనకు శిక్ష పడుతుందన్న నమ్మకం నాకు లేదు'' అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు.
ఉద్యమకారులకు ఉద్యమ నాయకుడిని దూరం చేసింది మాజీ ఎంపీ సంతోష్‌రావేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. గద్దర్ లాంటి నాయకులు గేటు బయట ఉండాల్సి వచ్చిందంటే దానికి కారణం ఆయనేనని ఆరోపించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్సైజ్ పోలీసులంటే గంజాయి సరఫరాదారులు, స్మగ్లర్లకు భయం లేదని కవిత అన్నారు. ఎక్సైజ్ పోలీసులు, అటవీశాఖ సిబ్బంది వద్ద ఆయుధాలు ఉంటేనే భయం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో గృహ హింస పెరిగిపోతోందన్నారు.

# చిన్నారిపై వీధికుక్క దాడి



## ముఖంపై గాయం

## శ్రీనివాస నగర్లో ఆడుకుంటున్న పాప



**హైదరాబాద్ , ప్రజాస్వరం**
ఖైరతాబాద్ పరిధిలో ఓ చిన్నారిపై వీధి కుక్క విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. శ్రీనివాస్ నగర్ కు చెందిన పాక శార్వి అనే నాలుగేళ్ల చిన్నారి మంగళవారం తన ఇంటి ముందు ఆడుకుంటోంది. ఆ సమయంలో అకస్మాత్తుగా ఒక వీధి కుక్క చిన్నారిపై పడి దాడికి దిగింది. చిన్నారి ముఖంపై కుక్క తీవ్రంగా గాయపరిచింది. పాప అరుపులు విన్న అటుగా బైక్‌పై వెళ్తున్న వాహనదారుడు, తల్లిదండ్రులు, స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని కుక్కను వెళ్లగొట్టారు.
**చిన్నారి శార్వి ముఖంపై లోతైన గాయాలు కావడంతో, కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే బంజారాహిల్స్ లోని రెయిన్‌బో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారి అక్కడ చికిత్స పొందుతోంది. పాప ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**

# సరైన విద్యతోనే పేదరిక నిర్మూలన

## టీచర్లు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలి

## మంత్రి కోమటిరెడ్డి



**నల్గొండ, ప్రజాస్వరం**
సరైన విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను సర్కారు పాఠశాలల్లోనే చదివించి మార్పు తీసుకురావాలని ఈ సందర్భంగా సూచించారు. విద్యకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. నల్గొండలోని బొట్టుగూడలో అత్యాధునిక వసతులతో ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాలను ఆయన ప్రారంభించారు. రూ.8కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ పాఠశాలలో అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడినా తొలి పదేళ్లలో మన సమస్యలు తీరలేదని మంత్రి అన్నారు. ప్రతి నియోజక వర్గంలో దాదాపు రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని.. కులమతాలకు అతీతంగా విద్యార్థులు చదువుకోవాలన్నది తమ ప్రభుత్వ ఆశయమని చెప్పారు.



# గిడ్డంగుల్లో అగ్నిప్రమాదం: ఎనిమిది మంది దుర్మరణం

కోల్‌కతా, ప్రజాస్వరం: దక్షిణ 24 పరగణాల జిల్లాలోని రెండు గిడ్డంగుల్లో అగ్నిప్రమాదం జరిగి ఎనిమిది మంది దుర్మరణం చెందారు. ప్రాథమిక విచారణలో ఆ యూనిట్లలో కనీస భద్రతా ఏర్పాట్లు లేవని తేలిందని పశ్చిమ బెంగాల్ అగ్నిమాపక సేవల శాఖ మంత్రి సుజిత్ బోస్ మంగళవారం తెలిపారు. సోమవారం తెల్లవారుజామున రెండు గిడ్డంగులలో మంటలు చెలరేగిన ప్రదేశాన్ని పరిశీలించిన బోస్, ఈ ఘటనకు సంబంధించి పోలీసు కేసు నమోదు చేసి, సమగ్ర విచారణ జరుపుతామని తెలిపారు. "నేను డైరెక్టర్ జనరల్ తో మాట్లాడాను. అక్కడ అగ్నిమాపక వ్యవస్థ అందుబాటులో లేదు. అగ్ని ప్రమాద తనిఖీ జరిగిందా లేదా అనేది కూడా మనం చూడాలి. ఒక ఫోరెన్సిక్ బృందం సంఘటనా స్థలాన్ని సందర్శిస్తుంది. ఎఫ్ఐఆర్ నమోదు చేసి, పూర్తి స్థాయి విచారణ చేపడతాం," అని మంత్రి విలేకరులతో అన్నారు. ఏడు గంటల పాటు శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. మృతులంతా గోదాములోని కార్మికులని పోలీసులు గుర్తించారు.



# మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ రాహుల్

**తూప్రాన్ జనవరి 27 (ప్రజాస్వరం) పూర్ణ రాజు గౌడ్ ప్రతినిధి**

తూప్రాన్ మున్సిపాలిటీ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్. మాట్లాడుతూ తూప్రాన్ మున్సిపల్ లో 16 వార్డులు 32 పోలింగ్ స్టేషన్ లు ఆరుగురు రిటర్నింగ్ అధికారులు ఉంటారని మున్సిపల్ నామినేషన్ ప్రక్రియ మున్సిపల్ కార్యాలయంలోని ఉంటుందని ఆయన అన్నారు ఎన్నికల షెడ్యూలు ఎప్పుడు వచ్చినా ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు జిల్లాలో మెదక్. రామయంపేట్. తూప్రాన్.నర్సాపూర్. నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయని అందులో 75 వార్డులు 150 పోలింగ్ స్టేషన్ లు మున్సిపల్ కమిషనర్ లు అధికారులు పరిశీలించడం జరిగిందన్నారు కౌంటింగ్ కేంద్రాలు కూడా నిర్ణయించామని కలెక్టర్ తెలిపారు ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి మున్సిపల్ కమిషనర్ పాతూరు గణేష్ రెడ్డి మున్సిపల్ అధికారులు సిబ్బంది ఉన్నారు

# మద్రాస్ హైకోర్టులో సినీ నటుడు విజయ్‌కు చుక్కెదురు

చైన్నై, ప్రజాస్వరం
మద్రాస్ హైకోర్టులో సినీ నటుడు విజయ్ కి చుక్కెదురు ఎదురైంది. జననాయగన్ సినిమా వివాదంలో సింగిల్ బెంచ్ తీర్పును మద్రాస్ హైకోర్టు రద్దు చేసింది. U/A సర్టిఫికెట్ ఇవ్వాలని గతంలో సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. సింగిల్ బెంచ్ తీర్పును సెన్సార్ బోర్డ్ సవాల్ చేసింది. సింగిల్ బెంచ్ తీర్పును రద్దు చేస్తూ మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

